
సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 28 । జూన్ । 2025



టన్ను చీనీ రూ.31,100

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.31,100, కనిష్టంగా రూ.15 వేల ప్రకారం ధర పలికాయి.



అరటిసాగులో ఆదర్శం

పెనుకొండ మండలం మంగాపురానికి చెందిన గోపాల్‌రెడ్డి అరటిసాగులో ఆదర్శంగా నిలుస్తున్నాడు. యాలక్కిలో అంతర పంటలు సాగుచేస్తూ ఆదాయం గడిస్తున్నాడు. 8లో

గరిష్టం/కనిష్టం
34.5°/22.6°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఈవీఎంల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

ధర్మవరం అర్బన్: ఈవీఎంల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, నిఘా కూడా పెంచాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఆయన పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఉన్న ఈవీఎం గోడౌన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలో ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. గోడౌన్ల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ సురేష్‌బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

సెంట్రల్ స్కూల్‌లో ప్రవేశాలకు లాటరీ



ప్రవేశాలకు లాటరీ తీస్తున్న దృశ్యం

గోరంట్ల: మండల పరిధిలోని 'నాసిన్' ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంట్రల్ స్కూల్‌లో ప్రవేశాలకు (2025–26 విద్యా సంవత్సరం) శుక్రవారం లాటరీ తీశారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ పర్యవేక్షణలో పాఠశాల ప్రిన్సిపాల్ మార్కండేయులు ఆధ్వర్యంలో ప్రక్రియ నిర్వహించారు. సెంట్రల్ స్కూల్‌లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో తరగతిలో 40 సీట్ల చొప్పున అందుబాటులో ఉంచి నోటిఫికేషన్ ఇచ్చారు. నిర్ణీత గడువులో మొత్తం 714 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. శుక్రవారం నిర్వహించిన లాటరీలో విద్యార్థుల ఎంపిక ప్రక్రియ దాదాపు పూర్తి చేశామని, త్వరలో తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. తహసీల్దార్ మారుతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దిమ్మె పైనుంచి పడి 'ఉపాధి' ఉద్యోగి మృతి

గోరంట్ల: ఆర్టీసీ బస్టాండ్‌లో కూర్చునేందుకు ఏర్పాటు చేసిన దిమ్మె పైనుంచి పడి ఉపాధి హామీ పథకం ఈసీగా పనిచేస్తున్న గంగాధర్ (56) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గంగాధర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం బెంగళూరు వెళ్లేందుకు శుక్రవారం తెల్లవారుజామున స్థానిక ఆర్టీసీ బస్టాండుకు వచ్చాడు. బస్సుకోసం వేచి చూస్తూ పక్కనే ఉన్న దిమ్మెపై కూర్చున్నాడు. కొద్దిసేపటి తర్వాత దిమ్మె పైనుంచి కింద పడి మృతి చెందాడు. గంగాధర్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. డ్వామా పీడీ విజయేంద్ర, ఏపీడీ శివనందనాయక్, ఎంపీడీఓ నరేంద్ర పెనుకొండ మార్చురీ వద్ద గంగాధర్‌కు నివాళులర్పించారు. కుటుంబీకులకు తక్షణ సాయం అందించారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి. చిత్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు అనంత, ఉషశ్రీ, పార్లమెంట్ పరిశీలకుడు నరేష్ కుమార్ రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, సమన్వయకర్తలు శైలజానాథ్, రంగయ్య, వై.వెంకటరామిరెడ్డి, టీఎన్ దీపిక, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్



కార్యక్రమానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

బాబు మోసాలు వివరిద్దాం

- హామీల అమలులో ఘోరంగా విఫలం
- బెదిరింపులు, కేసులకు భయపడేది లేదు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల

బుక్కరాయసముద్రం/శింగనమల: చంద్రబాబు ఏడాది పాలనలో హామీలు అమలు చేయకుండా ప్రజలకు చేసిన మోసాలను లెక్కలతో సహా వివరిద్దామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రెడ్‌బుక్ మాటున సాగిస్తున్న అరాచకాలకు, బెదిరింపులకు భయపడేది లేదన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. శింగనమల నియోజకవర్గానికి సంబంధించి బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఇదే వేదిక నుంచి 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, అనంతపురం, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు నరేష్ కుమార్ రెడ్డి, రమేష్‌రెడ్డి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉషశ్రీచరణ్, నియోజకవర్గ సమన్వయకర్తలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, మెట్టు గోవింద



వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, చిత్రంలో శైలజానాథ్

రెడ్డి, తలారి రంగయ్య, ఈరలక్కప్ప, దీపిక, మక్బుల్ అహ్మద్, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అధికార ప్రతినిధి ఎంపీ గోరంట్ల మాధవ్, పీఏసీ సభ్యులు మాలగుండ్ల శంకరనారాయణ, మహాలక్ష్మి శ్రీనివాస్, అనంతపురం మేయర్ వసీం, టాస్క్ ఫోర్స్ సభ్యుడు రమేష్ గౌడ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల నాయక్, రాష్ట్ర ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పెన్నోబిలేసు, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కృష్ణవేణి, పార్టీ అనంతపురం నగర అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ముఖ్య అతిథులకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు స్వాగతం పలికారు. అక్కడే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి సిద్దరాంపురం రోడ్డు మీదుగా వైఎస్సార్‌సీపీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ సక్రమంగా నెరవేర్చలేదన్నారు. ప్రజలను మోసగించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కూటమి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ప్రజలందరికీ గుర్తు చేయడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో' కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ప్రకటించారు. 2019–24 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. 5 ఏళ్ల పాలనతో జగనన్న రాష్ట్రాన్ని పదేళ్లు ముందుకు తీసుకెళితే చంద్రబాబు ప్రస్తుత ఏడాది పాలనలో రాష్ట్రాన్ని 15 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, జెడ్పీటీసీలు భాస్కర్, భోగాతి ప్రతాప్‌రెడ్డి, నాయకులు నరేష్, సర్పంచ్ పార్వతి, పూల నారాయణస్వామి, నందినేని మల్లికార్జున, గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బొమ్మన శ్రీరామిరెడ్డి, తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి, నార్పల సత్యనారాయణరెడ్డి, రఘునాథరెడ్డి, ముత్యాల శీనా, పురుషోత్తం, పెద్ద కొండయ్య, చికెన్ నారాయణస్వామి, శ్రీనివాస రెడ్డి, ఆది, తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలను తిప్పికొట్టాలి



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నేతలు దాడులకు పాల్పడడం పిరికిపంద చర్య అని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఖండించారు. అన్యాయంగా కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టాలని చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా ఉంటామన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అరాచకాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా చంద్రబాబు నుంచి గ్రామస్థాయి నాయకుల వరకు అవినీతి అక్రమాల్లో మునిగిపోయారన్నారు. హామీలు అమలు చేయకుంటే ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

కార్యకర్తలకు తోడుగా ఉంటా



వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. రాజకీయంగా ఎదుర్కోలేక అధికార పార్టీ నాయకులు రెడ్‌బుక్ మాటున అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. టీడీపీ వారు ఇసుక, ఎర్రమట్టి, రేషన్ బియ్యం దందా కోసం కొట్టుకుచస్తున్నారన్నారు. నాణ్యమైన చదువు, నాణ్యమైన మందులు, నాణ్యమైన భోజనం ఇస్తాం అని చెప్పిన ముఖ్యమంత్రులను చూశాం కానీ.. నేడు నాణ్యమైన మద్యం ఇస్తామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబును చూస్తున్నామన్నారు.

వ్యవస్థలు నాశనం



పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను కూటమి సర్కారు నాశనం చేసిందని వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ప్రతిపక్ష నేతలను అణగదొక్కేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. కేసులు పెడతామని, భూములను లాక్కుంటామని బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇలాంటి వాటికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భయపడవద్దని అన్నారు. పార్టీ తరఫున అండగా ఉంటామన్నారు. అధికారులు, పోలీసులుకు భారత రాజ్యాంగం ప్రకారమే ఉద్యోగాలు ఇచ్చారని, దానికి లోబడే పని చేయాలని హితవు పలికారు. రెడ్‌బుక్ ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తించి విమర్శలపాలు కావొద్దని పోలీసు అధికారులకు సూచించారు.

మహిళలకు రక్షణ కరువు



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మహిళలకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చాలా మంది బాలికలు మిస్సింగ్ అవుతున్నా మహిళా పక్షపాతి అని చెప్పుకునే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మాత్రం నోరుమెదపరన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బాలికలపై అత్యాచారాలు జరిగితే సీఎం, హోంమంత్రి, డిప్యూటీ సీఎం కానీ పరామర్శించిన పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టకపోయినా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు.

జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి చేద్దాం

'దిశ' సమావేశంలో చైర్మన్ బీకే పార్థసారధి

ప్రశాంతి నిలయం: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడటంతో పాటు జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని హిందూపురం పార్లమెంట్ సభ్యుడు, జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) చైర్మన్ బీకే పార్థసారధి పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్, ఎంపీ బీకే పార్థసారధి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మెంబర్ సెక్రెటరీ, కలెక్టర్ టీఎస్ చేతన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీకే పార్థసారధి మాట్లాడుతూ.. 'తల్లికి వందనం' పథకం ద్వారా రాష్ట్రంలోని 67 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందారని, సాంకేతిక లోపాలవల్ల కొందరు పథకం పొందలేకపోయారన్నారు. 'పీఎం కిసాన్ సన్మాన్' పథకం కింద అర్హత కలిగిన రైతులకు ఏడాదికి రూ.6 వేలు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. అలాగే 'అన్నదాత సుఖీభవ' పథకం కింద అదనంగా రూ.14 వేలు ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు. అర్హులు ఉంటే వెంటనే గుర్తించాలన్నారు. వార్షిక ప్రీమియం రూ.456 చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం సంభవించినా రూ.2 లక్షల బీమా లబ్ధి కలుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరై పూర్తయిన పనులను గుర్తించి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని డ్వామా పీడీని ఆదేశించారు. జిల్లాలో రూ.3 వేల కోట్లతో చేపట్టిన జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దిశ కమిటీ చైర్‌పర్సన్ బీకే పార్థసారధి, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు

పింఛన్లపై విచారణ చేయించండి..

గతంలో మంజూరైన పింఛన్లపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు మాత్రమే పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సభలను ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలుగకుండా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానంలో వెంటనే మరొకరిని నియమించాలన్నారు.

మూడు నెలలకోసారి సమావేశం..

కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ... ప్రతి మూడు నెలలకు ఒకసారి 'దిశ' కమిటీ సమావేశం జరుగుతుందన్నారు. కేంద్రం నిధులతో చేపట్టిన పథకాలు ఏ విధంగా అమలవుతున్నాయి, వాటి లోపాలను దిశ కమిటీ సమావేశంలో చర్చిస్తామన్నారు. ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకొని కేంద్రానికి నివేదిస్తామన్నారు. సమావేశంలో పుట్టపర్తి, కదిరి, మడకశిర ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, ఎంఎస్ రాజు, ఎస్పీ వి.రత్న, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్, గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటనారాయణ, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి వంశీకృష్ణారెడ్డితోపాటు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సిఫార్సులకే పెద్దపీట

- సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో 'రాజకీయం'
- సిఫార్సు లేఖల కోసం ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లచుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణలు
- శుక్రవారం జరిగిన వార్డు అడ్మిన్ బదిలీల్లో గందరగోళం
- కౌన్సెలింగ్ శనివారానికి వాయిదా

ప్రశాంతి నిలయం/అనంతపురం కార్పొరేషన్: పాలనలో కీలకమైన సచివాలయ వ్యవస్థను తమ అదుపులో పెట్టుకోవాలని, తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు కూటమి నేతలు బదిలీలను వేదికగా మార్చుకున్నారు. గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో ఈనెల 25 నుంచి వివిధ విభాగాల్లో పని చేస్తున్న గ్రామ/వార్డు ఉద్యోగులు బదిలీలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే కూటమి నాయకులు తమ పరిధిలోని సచివాలయాల్లో తమకు కావాల్సిన ఉద్యోగులను తెచ్చుకునేందుకు ప్లాన్ చేశారు.

సిఫార్సులకు ప్రాధాన్యం ఇవ్వండి..

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో ప్రజాప్రతినిధుల సిఫార్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉన్నతాధికారులకు మౌఖికంగా ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సిఫార్సు లేఖ ఉంటేనే కోరుకున్న చోటకు బదిలీ సాధ్యమని భావించిన ఉద్యోగులు లేఖల కోసం ఎంపీలు, ఎమ్మెల్యేల ఇళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పనితీరు, నిబంధనలన్నీ పక్కనపెట్టి ప్రజాప్రతినిధి సూచన మేరకు ఉద్యోగి కోరుకున్న స్థానానికి బదిలీ చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేయడంతో అర్హులు తమకు కావాల్సిన స్థానాలను పొందేందుకు వీలులేకుండా పోయిందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.



ఆందోళన చేస్తున్న సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు

రిక్వెస్టుతో కోరుకున్న చోటుకు..

544 గ్రామ/వార్డు సచివాలయాలు ఉండగా.. 4,373 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడిన తర్వాత 2020 అక్టోబర్‌లో కొందరు, తరువాత నెల రోజుల వ్యవధిలో మరికొందరు ఉద్యోగులు విధుల్లో చేరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒకేచోట ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని మాత్రమే బదిలీ చేయాల్సి ఉంది. అలాగే మ్యూచువల్, స్పౌజ్, హెల్త్ తదితర కారణాలతో ఉద్యోగులు రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలా రిక్వెస్టు అంశాలను సాకుగా చూపి చాలా మంది తాము కోరుకున్న ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

బదిలీల్లో గందరగోళం

మరోవైపు వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో తీవ్ర గందరగోళం నెలకొంది. శుక్రవారం బదిలీలు చేపట్టాలని ఆగమేఘాలపై సర్క్యులర్ విడుదల కాగా, ముందురోజు రాత్రి 11 గంటలకు ఉద్యోగులకు ఫోన్ ద్వారా సమాచారం తెలపడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని నగరపాలక సంస్థ, 11 మున్సిపాలిటీల పరిధిలో విధులు నిర్వర్తించే సచివాలయ ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అనంతపురంలోని జీసస్‌నగర్‌లోని జయమణెమ్మ కళ్యాణమంటపంలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి నేతృత్వంలో వివిధ మునిసిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది.

స్పష్టత లేక..ఖాళీలు చూపక

ఉమ్మడి జిల్లాలో 304 సచివాలయాల పరిధిలో 286 మంది అడ్మిన్ పోస్టులుండగా.. అందులో 18 ఖాళీలున్నాయి. కౌన్సెలింగ్‌కు 176 మంది అడ్మిన్‌లు హాజరయ్యారు. కాగా ఐదేళ్లు ఒకేచోట పని చేసిన వారు బదిలీలకు అర్హులని జీఓలో పేర్కొంది. కాగా, 2021లోనూ బదిలీల్లో భాగంగా మరో వార్డు సచివాలయాలకు బదిలీ అయిన వారు చాలా మందే ఉన్నారు. ఈ లెక్కన వారికి బదిలీ ఉండకూడదు. కానీ మునిసిపల్ ఆర్‌డీ విశ్వనాథ్... ఏదైనా మునిసిపాలిటీ పరిధిలో 5 ఏళ్ల పాటు పని చేస్తున్న వారంతా బదిలీకి అర్హులని చెప్పారు. దీంతో దీనిపై స్పష్టత రాలేదు. ఇక అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలోని 74 సచివాలయాల్లో పది మందికి పైగా బిల్ కలెక్టర్‌లు అడ్మిన్‌లు చేస్తున్నారు. ఈ సచివాలయాలను బదిలీల జాబితాలో చూపలేదు. మునిసిపాలిటీల్లో వివిధ సచివాలయాల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న కొందరినీ పరిగణనలోకి తీసుకోకపోవడంతో సచివాలయ ఉద్యోగులు అభ్యంతరం తెలిపారు.

చివరకు కౌన్సెలింగ్ వాయిదా..

నగరపాలక సంస్థ అడ్మిన్ బదిలీల కౌన్సెలింగ్ రసాభాసగా సాగింది. శుక్రవారం రాత్రి ఉద్యోగుల ర్యాంక్, స్పౌజ్‌ల విషయంలో తీవ్ర గందరగోళం నెలకొంది. పారదర్శకంగా చేపట్టడం లేదంటూ అడ్మిన్ కార్యదర్శులు ఆందోళన చేశారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. చివరకు ఆర్‌డీ విశ్వనాథ్ బదిలీల కౌన్సెలింగ్ వద్దకు చేరుకోగా, కార్యదర్శులు ఆయన్ను చుట్టుముట్టి తమకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను పోలీసులు బలవంతంగా బయటకు పంపారు. అనంతరం బదిలీల కౌన్సెలింగ్‌ను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు ఆర్‌డీ విశ్వనాథ్ ప్రకటించారు.

మొహర్రం ఉత్సవాలు ప్రారంభం



మొహర్రం వేడుకల్లో బత్తలపల్లి కూడలికి చేరిన పీర్లను దర్శించుకునేందుకు వచ్చిన జనం(ఫైల్), (ఇన్‌సెట్) శుక్రవారం బత్తలపల్లి కాశీంస్వామి తొలిదర్శనం చేయిస్తున్న దృశ్యం

- భక్తులకు కాశీంస్వామి తొలిదర్శనం

బత్తలపల్లి: మత సామరస్యానికి, హిందూ– ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గూగూడు తర్వాత ఆ స్థాయిలో మొహర్రం ఉత్సవాలు జరిగే బత్తలపల్లి ఆధ్యాత్మిక శోభను నింపుకుంది. మండల వ్యాప్తంగా వైభవంగా నిర్వహించే మొహర్రం ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బత్తలపల్లిలోనూ ఖాసీంస్వామి(మొహర్రం) ఉత్సవాలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ఉదయం గ్రామ పెద్దల సమక్షంలో పీర్లను భద్రపరిచే పెట్టెను కిందకు దించి ముజావర్లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుండం తీసి వేడుకలకు అంకురార్పణ చేశారు. రాత్రి ఖాశీంస్వామి ప్రథమ దర్శనంతో భక్తులు పులకించారు.

పదిరోజుల పాటు ఉత్సవాలు

ఉత్సవాలు పదిరోజుల పాటు వైభవంగా జరుగుతాయని ముజావర్లు(పూజారులు) తెలిపారు. జూలై 2న ఐదవ సరిగెత్తు, 4న చిన్నసరిగెత్తు(పానకాలు), 5వ తేదీ ఉదయం గ్రామోత్సవం, 6న పెద్ద సరిగెత్తు, 7న అగ్నిగుండ ప్రవేశం... జలధికి ఉత్సవం ఉంటుందన్నారు.

కుళ్లాయిస్వామి గోవిందా

- ప్రథమ దర్శనంతో పులకించిన భక్తులు

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తిరుమల కొండన్న వంశీయులు కుళ్లాయిస్వామి పీరును భద్రపరిచే పెట్టెను కిందకు దింపి.. సుగంధ ద్రవ్యాలతో శుభ్రం చేశారు. కుళ్లాయిస్వామి ప్రతిమకు, అగ్ని గుండానికి ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరి దివిటీల వెలుగులో, సన్నాయి వాయిద్యాల నడుమ పట్టు వస్త్రాలు, బంగారు గొలుసుల నడుమ కుళ్లాయిస్వామి ప్రథమ దర్శనం భక్తులకు కల్పించారు.





పీర్లను దర్శించుకునేందుకు వచ్చిన జనం

క్లుప్తంగా

సబ్సిడీ బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యాన్ని చూపుతున్న అధికారులు

రాప్తాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేసులు తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లా సోమందేపల్లి గ్రామానికి చెందిన నరేష్ 42 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కర్ణాటకలోని పావగడకు బొలెరో వాహనంలో తరలిస్తూ శుక్రవారం రాప్తాడులోని వైఎస్సార్ సర్కిల్‌లో పట్టుపడ్డాడన్నారు. వాహనాన్ని సీజ్ చేసి, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు వివరించారు. తనిఖీల్లో సీఐ శ్రీహర్ష, సీఎస్‌డీటీ జ్యోతి పాల్గొన్నారు.

క్షుద్ర పూజల కలకలం

నల్లచెరువు: స్థానిక పూలకుంట రోడ్డులోని తాటిచెర్ల బ్రదర్స్ క్రికెట్ మైదానంలో ముగ్గులు, కోడిగుడ్లు వేసి క్షుద్ర పూజలు నిర్వహించారు. క్రికెట్ మైదానంలో క్షుద్ర పూజలు నిర్వహించడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆటలో గెలుపు కోసమా? లేదా, క్రీడాకారులపై క్షుద్ర పూజలు చేశారా? అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. కాగా, మండల కేంద్రంలోని ఓ మొబైల్ షాప్ వద్దనూ ఇలాగే పూజలు చేశారు. బుధవారం అమావాస్య సందర్భంగా ఈ పూజలు నిర్వహించినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

తలుపుల: మండలంలోని భూపతివారిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. అందిన సమాచారంతో శుక్రవారం తనిఖీలు చేపట్టి 13 మందిని అరెస్ట్ చేసి, రూ. 68,200 నగదు, 6 ద్విచక్ర వాహనాలు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

అరటి సాగులో ఆదర్శం

- అంతర్ పంటలుగా వక్క, టెంకాయ
- బెంగళూరులో నివాసముంటూ సొంతూరిలో వ్యవసాయం

సాగును భారంగా భావిస్తున్న ప్రస్తుత తరుణంలో ఓ ఉద్యోగి పంటల సాగుపై మక్కువ పెంచుకున్నాడు. వృత్తి రీత్యా బెంగళూరులో స్థిరపడినా... సొంతూరులోని పొలంలో వివిధ రకాల పంటలను సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాడు.





సాగు చేసిన అరటి పంటను చూపుతున్న రైతు గోపాలరెడ్డి, కోత దశలో ఉన్న యాలక్కి అరటి గెలలు

పెనుకొండ: అరటి సాగులో పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మంగాపురం గ్రామానికి చెందిన గోపాలరెడ్డి వైవిధ్యాన్ని కనబరుస్తూ పలువురిని ఆకర్షిస్తున్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఆయన కుటుంబసభ్యులతో కలసి మహానగరంలోనే నివాసముంటున్నారు. అయితే వ్యవసాయంపై మక్కువ ఉన్న ఆయన తరచూ అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తూ గ్రామంలో తనకున్న 3.75 ఎకరాల్లో యాలక్కి రకం అరటి సాగు చేపట్టారు. ప్రస్తుతం కోత దశలో ఉన్న అరటి గెలలను బెంగళూరుకు చెందిన వ్యాపారులకు టన్ను రూ. 50 వేల చొప్పున విక్రయించేలా ఒప్పందం చేసుకున్నారు.

రూ. 26 లక్షల ఖర్చు..

తన తమ్ముడి సహకారంతో యాలక్కి అరటి సాగులో అంతర్‌పంటగా వక్క, టెంకాయ చెట్లను గోపాలరెడ్డి పెంచుతున్నారు. ఈ క్రమంలో పొలం చుట్టూ ఫెన్సింగ్, బోరు వేయించడం, డ్రిప్ ఏర్పాటు, షెడ్ నిర్మాణం, వీడర్ కొనుగోలు, పొలం చదును, కూలీలు, ఇతర ఖర్చులు కలిపి దాదాపు రూ.26 లక్షల వరకూ వెచ్చించారు. కర్ణాటకలోని నెలమంగల సమీపంలో ఉన్న గ్రీన్‌లీ బనానా కంపెనీ నుంచి టిష్యూ కల్చర్ అరటి ఒక్కో మొక్కను రూ.30 చొప్పున, శివమొగ్గ సమీపంలోని తీర్థహళ్లి నుంచి వక్క మొక్కలు, చెళ్లకెర నుంచి ఒక్కో టెంకాయ మొక్కను రూ.380తో కొనుగోలు చేశారు. మొత్తం 2,500 అరటి మొక్కలు, 1,800 వక్క, 110 టెంకాయ మొక్కలను ఒకేసారి పొలంలో నాటి సాగు చేపట్టారు. ప్రస్తుతం చేతికి అందివచ్చిన తొలిదశ అరటి పంటను విక్రయించగా రూ.3.50 లక్షల ఆదాయం సమకూరింది. మరో రెండు కోతల పంట చేతికి వచ్చే అవకాశముంది. అరటి పిలకలను విక్రయిస్తుంటారు. ఒక్కో పిలకను రూ.20 నుంచి రూ.25 చొప్పున కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. అరటి ఆకులను బెంగళూరుకు తరలించి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం అరటి మొక్క బోద నుంచి లభ్యమయ్యే గడ్డను ఇతర రైతులు తీసుకెళ్లి తమ పొలాల్లో పంట పెట్టుకుంటున్నారు. ఒక్కో గడ్డను రూ.15 చొప్పున విక్రయిస్తున్నారు.

అవగాహనతోనే పంటల సాగు

పంటల సాగుపై అనుభవం ఉంది. పిల్లల భవిష్యత్తు కోసం బెంగళూరులో నివాసముంటూ భార్యతో కలసి ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నా. గ్రామంలో పెద్దల నుంచి సంక్రమించిన 3.75 ఎకరాల పొలాన్ని బీడుగా మార్చడం ఇష్టం లేక అరటి సాగు చేపట్టాను. భవిష్యత్తు ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అంతర్ పంటగా వక్క, టెంకాయ చెట్లను పోషిస్తున్నా. వృద్ధురాలైన తల్లి, వికలాంగుడైన తమ్ముడు తోడుగా ఉంటున్నారు. పంట సాగులో రైతులెవరైనా నా సహకారం కావాలనుకుంటే 974047 1698కు ఫోన్ చేసి సలహాలు తీసుకోవచ్చు.

– గోపాలరెడ్డి, రైతు



చక్కగా పెరుగుతున్న టెంకాయ చెట్టు

కంటైనర్‌ను ఢీకొన్న ట్రావెల్స్ బస్సు

- ఆరుగురు ప్రయాణికులకు గాయాలు



చిలమత్తూరు: రోడ్డు పక్కన ఆపిన కంటైనర్‌ను వేగంగా దూసుకొచ్చిన ఓల్వో బస్సు ఢీకొంది. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని రాయచూరు నుంచి బెంగళూరుకు 33 మంది ప్రయాణికులతో వీఆర్ఎల్ ట్రావెల్స్‌కు చెందిన ఓల్వో బస్సు బయలుదేరింది. శుక్రవారం తెల్లవారుజామున చిలమత్తూరు మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై కోడూరు తోపు సమీపంలో ఉన్న గార్మెంట్స్ పరిశ్రమ వద్దకు చేరుకోగానే అప్పటికే రోడ్డు పక్కన ఆపిన కంటైనర్ ఆలస్యంగా గమనించిన ఓల్వో డ్రైవర్ వేగాన్ని నియంత్రించేలోపు నేరుగా వెళ్లి ఢీకొంది. ఘటనలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా తొలుత కర్ణాటకలోని బాగేపల్లిలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కంటైనర్ నుంచి బస్సును వేరు పరిచి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు చిలమత్తూరు పీఎస్ ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.

చెరువుల్లో మట్టిని తరలించుకోండి : మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ: అవసరాన్ని బట్టి చెరువుల్లోని మట్టిని తరలించుకోవాలని రైతులకు మంత్రి సవిత సూచించారు. ఈ విషయంగా అధికారులు ఎవరూ అడ్డు చెప్పరని అన్నారు. స్థానిక తన కార్యాలయంలో నియోజకవర్గ సాగునీటి సంఘం అధ్యక్షులతో శుక్రవారం ఆమె సమావేశమై మాట్లాడారు. రైతులు మట్టి తోలుకునేందుకు ట్రాక్టర్‌కు రూ.3 చెల్లిస్తే చాలన్నారు. నియోజకవర్గంలోని సాగునీటి కాలువల్లో జంగిల్ క్లియరెన్స్, మట్టి తవ్వకాలకు రూ. 3.50 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రూ.50 కోట్లతో నియోజకవర్గంలోని 26 చెరువులను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. జంగిల్ క్లియరెన్స్‌కు మంజూరైన రూ.50 లక్షల నిధులతో కాలువల్లో ముళ్ల పొదల తొలగింపు, పూడిక తీత పనులు చేపట్టనున్నామన్నారు. అయితే ఈ నిధుల వినియోగానికి జీఎస్టీ సమస్య వుందని త్వరలో పరిష్కరించి పనులు ప్రారంభిస్తామన్నారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



విమానాశ్రయంలో పర్యటిస్తున్న విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు , కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్: 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జూలై 5వ తేదీన కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉండటంతో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ వి. విజయరామరాజు కలెక్టర్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే సింధూరారెడ్డితో కలిసి కొత్తచెరువులో పర్యటించారు. జూనియర్ కళాశాల, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరిసర ప్రాంతాలు, గదులను పరిశీలించారు. సీఎం పర్యటన ఏర్పాట్ల గురించి సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం సత్యసాయి విమానాశ్రయాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే విమానాశ్రయంలో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు.

మట్కా రాస్తున్న మహిళల అరెస్ట్

తాడిపత్రి టౌన్: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మట్కా రాస్తున్న ముగ్గురు మహిళలను అరెస్ట్ చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం తనిఖీలు చేపట్టి పక్కా ఆధారాలతో సరస్వతి, కుళ్లాయమ్మ, జ్యోతిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1.30 లక్షల నగదు, సెల్‌ఫోన్లు, మట్కా పట్టీలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పీఆర్‌లో నేడు బదిలీల కౌన్సెలింగ్

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులకు శనివారం అనంతపురంలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ చేపట్టనున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ, వార్డు సచివాలయాల రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టి సంఖ్యను కుదించింది. దీంతో 534 సచివాలయాలు మాత్రమే మనుగడలో ఉన్నాయి. ఈ లెక్కన ఐదేళ్లు పూర్తయిన వారు 315 మంది, ఐదేళ్ల కంటే తక్కువ సర్వీసు కలిగిన వారు 147 మంది ఉన్నారు. ఖాళీలు 72 ఉన్నట్లు తేల్చారు.

యువకుడి దుర్మరణం



మృతుడు హెయాన్స్

కనగానపల్లి: కారు టైర్ పేలడంతో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. కేరళలోని ఎంబీబీఎస్ కళాశాలలో సీటు దక్కిన తన కుమారుడు హెయాన్స్ నాయక్ (20)ను ఆ కళాశాల చేర్పించేందుకు మహారాష్ట్రలోని అమరావతికి చెందిన మనీషాబాయి తన సమీప బంధువుతో కలసి కారులో వెళ్లారు. అడ్మిషన్ ప్రక్రియ ముగించుకున్న అనంతరం శుక్రవారం ఉదయం కారులో తిరుగు ప్రయాణమయ్యారు. కనగానపల్లి మండలం మామిళ్లపల్లి వద్దకు చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై కారు ముందు చక్రానికి అమర్చిన టైరు పేలి రహదారి పక్కన ఉన్న గుంతలోకి బోల్తా పడింది. హెయన్స్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మనీషాబాయి, బంధువు సందీప్ నాయక్, డ్రైవర్ సమీర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా అనంతపురం తరలించారు. ఘటనపై కనగానపల్లి పీఎస్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శ్రీచైతన్యలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల సీజ్



తరగతి గదిని సీజ్ చేస్తున్న ఎంఈఓ గంగప్ప

హిందూపురం టౌన్: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన ఎంఈఓ గంగప్ప శుక్రవారం ఆయా తరగతులను సీజ్ చేశారు. కాగా, శుక్రవారం ఉదయం ఆ పాఠశాలను వైఎస్సార్ ఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరీష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తుండడంతో ఎంఈఓకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. శ్రీచైతన్య పాఠశాలలో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి రూ.22వేల నుంచి రూ25 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. పాఠశాలలోనే పుస్తకాలు, యూనిఫాం, టై, షూ, బ్యాగులను శ్రీచైతన్య పాఠశాల పేరుతో ముద్రించి ఇక్కడే కొనాలని నిబంధన పెట్టి దాదాపు రూ.8500ల వరకు వసూలు చేశారన్నారు. ఎంఈఓ గంగప్ప మాట్లాడుతూ.. శ్రీచైతన్య పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతుల నిర్వహణకు అనుమతులు లేవని, ఇకపై నిర్వహించకూడదని అన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు చంద్రశేఖర్, భరత్, సాయిరాం, అనుదీప్, ఫణి, నాజీర్, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రిపై తనయుడి కొడవలితో దాడి



గాయపడిన క్రిష్టప్ప

పరిగి: తాను అడిగిన డబ్బు ఇవ్వలేదన్న అక్కసుతో తండ్రిపై తనయుడు కొడవలితో దాడి చేసి, గాయపరిచాడు. పోలీసులు తెలిపిన మేరకు.. పరిగి మండలం ఎర్రగుంటలో నివాసముంటున్న వృద్ధుడు మోదప్పగారి క్రిష్టప్పకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కూలి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవారు. కొన్నేళ్లుగా సోరియాసిస్‌తో బాధపడుతున్న రెండో కుమారుడు శంకర.. చికిత్స నిమిత్తం తరచూ తండ్రితో డబ్బులు అడిగేవాడు. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఆస్పత్రికి వెళ్లేందుకు డబ్బు కావాలని తండ్రిని అడిగాడు. తన వద్ద డబ్బు లేదని తండ్రి తెలపడంతో శంకర ఘర్షణ పడి కొడవలితో దాడి చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దాడిని అడ్డుకుని క్షతగాత్రుడిని హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరుకు తీసుకెళ్లారు. క్రిష్టప్ప భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

పరిగి: మండలంలోని మోదా పంచాయతీ పరిధిలోని ఓ గ్రామంలో ఎనిమిదేళ్ల బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన వృద్ధుడు వెంకటరమణపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. సోమందేపల్లి మండలానికి చెందిన వెంకటరమణ కొన్నేళ్లుగా పరిగి మండలంలోని ఓ గ్రామంలో భార్యతో కలిసి ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం తన పక్కింట్లో ఉంటున్న బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని అగ్రిగోల్డ్ కస్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షుడు పి.నారాయణస్వామితో కలసి విలేకరులతో ఆయన మాట్లాడారు. అగ్రిగోల్ బాధితులను ఆదుకునే అంశాన్ని టీడీపీ తన ఎన్నికల మేనిఫేస్టోలో ఉంచిందని గుర్తు చేశారు. అగ్రిగోల్డ్ ఆస్తులను వేలం ద్వారా విక్రయించి బాధితులకు న్యాయం చేస్తామని అప్పట్లో చంద్రబాబు చెప్పి ఏడాదవుతున్నా అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. అగ్రిగోల్డ్ సంస్థ బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. హామీని అమలు చేయకపోతే బాధితులతో కలిసి మరోసారి ఉద్యమానికి శ్రీకారం చుడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధేశ్వర్, జిల్లా అధ్యక్షుడు నారాయణప్ప, సభ్యులు కుళ్లాయప్ప, ధనుంజయ, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఎరువుల దుకాణం దగ్ధం



కాలిపోయిన ఎరువులు, మందులు, విత్తనాలు తదితర సామగ్రి

బత్తలపల్లి: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటల్లో ఓ ఎరువుల దుకాణం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన మేరకు.. బత్తలపల్లికి చెందిన మోహన్‌రెడ్డి స్థానిక కదిరి మార్గంలో 30 ఏళ్లుగా ఎరువుల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. గురువారం లావాదేవీలు ముగించుకున్న అనంతరం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో దుకాణంలో నుంచి పొగలు వస్తుండడంతో గమనించిన గస్తీ పోలీసులు సమాచారం అందివ్వడంతో వెంటనే యజమాని అక్కడు చేరుకుని షట్టర్ తెరిచాడు. అప్పటికే అక్కడకు చేరుకున్న రైతులు రెండు ట్రాక్టర్ ట్యాంకర్ల నీటితో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న ధర్మవరంలోని అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు నిర్ధారించారు. ఈ ఘటనతో దాదాపు రూ.3 కోట్ల విలువ చేసే ఎరువులు, పురుగు మందులు, వివిధ రకాల విత్తనాలు, ఇతర సామగ్రి కాలి బూడిదైనట్లు బాధిత యజమాని వాపోయాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన, కమ్యూనిస్టు పార్టీల నాయకులు తరలివచ్చి మోహన్‌రెడ్డికి ధైర్యం చెప్పారు. కోలుకునేందుకు అవసరమైన సాయం చేస్తామని భరోసానిచ్చారు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.